క్లుప్తంగా

ఆన్‌లైన్ క్విజ్‌కు రిజిస్ట్రేషన్ చేసుకోండి



పోటీపై అవగాహన కల్పిస్తున్న నాయకులు

సత్తుపల్లిటౌన్: వచ్చేనెల 17న జరిగే రాజీవ్‌గాంధీ యూత్ ఆన్‌లైన్ క్విజ్ పోటీల్లో పాల్గొనేందుకు 16నుంచి 36ఏళ్ల లోపు వారు రిజిస్ట్రేషన్ చేసుకోవాలని టీపీసీసీ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి కోటూరి మానవతారాయ్ కోరారు. సత్తుపల్లిలో శనివారం ఆయన పలు ప్రాంతాల్లో యువతకు అవగాహన కల్పించి రిజిస్ట్రేషన్ లింక్ కోసం 76618 99899 నంబర్‌కు మిస్డ్‌కాల్ ఇవ్వాలని సూచించారు. నియోజకవర్గ స్థాయిలో బహుమతులు ఉంటాయని తెలిపారు. నాయకులు రావి నాగేశ్వరరావు, ఐ.కృష్ణ, ఎం.డీ.ఫజల్‌బాబా, బాజ్జీ, ప్రసాద్, ఖలీల్, యూసుఫ్, ఇమ్రాన్, ఖాదర్‌బాబా పాల్గొన్నారు.

ఆర్టీసీ బస్సులో ప్రయాణం సురక్షితం

ఏన్కూరు: ఆర్టీసీ బస్సులో ప్రయాణం సురక్షితం అని సర్పంచ్ ఆరెం సుహాసని తెలిపారు. మండలంలోని తిమ్మారావుపేటలో దివ్యాంగులకు ఏర్పాటు చేసిన ఉచిత బస్‌పాస్ మేళాను శనివారం ఆమె ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ.. ఆర్టీసీ ఆధ్వర్యంలో దివ్యాంగులకు ఉచిత బస్‌పాస్‌లతో అనేక రాయితీలు ఇస్తుందన్నారు. 60 మంది దివ్యాంగులకు ఉచిత బస్‌పాస్‌లు అందించారు. కార్యక్రమంలో పంచాయతీ కార్యదర్శి సాయి, ఆర్టీసీ సిబ్బంది రవీందర్, వై.బుజేందర్ పాల్గొన్నారు.

నెహ్రూ వర్ధంతి

మధిర: కాంగ్రెస్ పార్టీ కార్యాలయంలో శనివారం భారత మాజీ ప్రధాని జవహర్ లాల్ నెహ్రూ వర్ధంతి నిర్వహించారు. ఆయన చిత్రపటానికి మండల కాంగ్రెస్ అధ్యక్షుడు సూరంశెట్టి కిషోర్ పూలమాలవేసి నివాళులర్పించారు. కార్యక్రమంలో కాంగ్రెస్ పార్టీ నాయకులు పత్తేపురపు సంగయ్య, దారా బాలరాజు, కర్నాటి రామారావు, షేక్ జహంగీర్, బాణావత్ వెంకటరమణ నాయక్, బిట్ర ఉద్దండయ్య, బండారు నరసింహారావు, ఆదిమూలం శ్రీనివాసరావు, ఖలీల్, చక్రి, అమీర్ తదితరులు పాల్గొన్నారు.

స్థానిక సమస్యలపై పోరాడాలి

ఎర్రుపాలెం: గ్రామాల్లో నెలకొన్న సమస్యలపై పార్టీ కార్యకర్తలు, నాయకులు పోరాడాలని సీపీఎం నియోజకవర్గ ఇన్‌చార్జ్, రాష్ట్ర కమిటీ సభ్యుడు పాలడుగు భాస్కర్ అన్నారు. శనివారం మండలంలోని భీమవరం గ్రామంలో నిర్వహించిన జోన్ కమిటీ సమావేశానికి విచ్చేసి కార్యకర్తలతో మాట్లాడారు. ఎన్నికల సమయంలో పాలక ప్రభుత్వాలు ఇచ్చిన హామీలను ఇప్పటికైన నెరవేర్చాలన్నారు. లేనియెడల పోరాటాలను నిర్వహిస్తామని హెచ్చరించారు. ప్రజలకు అండగా సీపీఎం ఎల్లవేళలా అండగా ఉంటుందన్నారు. ఈ సమావేశంలో రాష్ట్ర కమిటీ సభ్యులు పొన్నం వెంకటేశ్వరరావు, మండల కార్యదర్శి దివ్వెల వీరయ్య, హనుమంతరావు, వెంకటేశ్వరరావు, శ్రీనివాసరావు, లాలా, తిరుపతిరావు, జానీ, వెంకటనారాయణరెడ్డి, రాజారావు, ప్రభాకర్‌రావు, వెంకటనారాయణ, శ్రీహరి, బాలశౌరి ఉన్నారు.

6న విగ్రహ ప్రతిష్ఠ మహోత్సవం



పోస్టర్లను ఆవిష్కరిస్తున్న దృశ్యం

ముదిగొండ: మండలంలోని వనంవారికిష్టాపురంలో ముదిరాజుల సంఘం ఆధ్వర్యంలో నిర్మించిన నూతన ఆలయంలో వచ్చే నెల 6న విగ్రహ ప్రతిష్ఠ కార్యక్రమం నిర్వహించనున్నారు. పెద్దతల్లి, పోతురాజు విగ్రహాల ప్రతిష్ఠ మహోత్సవం సందర్భంగా శనివారం పోస్టర్లను ఆవిష్కరించారు. ఈ మహోత్సవానికి భక్తులు అధిక సంఖ్యలో హాజరు కావాలన్నారు. ముదిగొండ సొసైటీ చైర్మన్ తుపాకుల యలగొండస్వామి, ఎంపీటీసీ సభ్యురాలు సరస్వతి, అజయ్, సురేష్, కృష్ణ ఉన్నారు.

ప్రభుత్వానికి రైతు సమస్యలు పట్టవా..?

కొణిజర్ల: తెలంగాణ ప్రభుత్వానికి రైతు సమస్యలు పట్టడం లేదని సీపీఎం వైరా నియోజకవర్గ ఇన్‌చార్జ్ భూక్యా వీరభద్రం అన్నారు. శనివారం మండలంలోని చిన్నగోపతిలో సీపీఎం గ్రామ శాఖ ఆధ్వర్యంలో సీపీఎం సీనియర్ నాయకుడు, గ్రామ మాజీ సర్పంచ్ పెద్దకురమ బండారు మల్లయ్య, కమలమ్మ దంపతులను సన్మానించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. రైతు ప్రభుత్వం, రైతు పక్షపాతి అని చెప్పుకునే సీఎం కేసీఆర్‌కి వీరి సమస్యలు పట్టడం లేదా అని అన్నారు. ఎన్నికల ముందు ఇచ్చిన హామీలను అమలు చేయాలన్నారు. కార్యక్రమంలో జిల్లా కమిటీ సభ్యుడు తాళ్లపల్లి కృష్ణ, మండల కార్యదర్శి కుటుంబరావు, నాయకులు శ్రీనివాసరావు, భూషణం, రంజాన్, వెంకటేశ్వర్లు పాల్గొన్నారు.

అభివృద్ధి బాటలో ‘తల్లాడ’ పంచాయతీ

- మూడెకరాల్లో నర్సరీ, పల్లె ప్రకృతి వనం
- దాతల సహకారంతో వైకుంఠ రథం, స్వీపింగ్ మిషన్
- 92 శాతం ఇంటి పన్నుల వసూళ్లు
- పారిశుద్ధ్యంపై ప్రత్యేక శ్రద్ధ
- హర్షం వ్యక్తం చేస్తున్న ప్రజలు

సండే స్పెషల్

మండలంలోని తల్లాడ మేజర్ పంచాయతీ అభివృద్ధి బాటలో పయనిస్తోంది. తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వం విడుదల చేసిన నిధులతో పాటు గ్రామ పంచాయతీ నిధులతో అభివృద్ధి జరిగింది. పల్లె ప్రకృతి వనం, వన నర్సరీ, శ్మశాన వాటిక, రైతు వేదిక, వీధి వీధిన సీసీ రోడ్లతో గ్రామం కొత్తగా దర్శనమిస్తోంది. పంచాయతీలో 10,311 జనాభా ఉండగా.. 7,568 ఓటర్లు ఉన్నారు. మొత్తం 2,694 కుటుంబాలు నివసిస్తున్నారు. గ్రామ పంచాయతీలో అభివృద్ధి పనులు గ్రామ పంచాయతీ ఈఓ ఉమా, సర్పంచ్ సంధ్యారాణిల సమన్వయంతో జరుగుతున్నాయి.



తల్లాడలో ఏర్పాటు చేసిన పల్లె ప్రకృతి వనం

తల్లాడ: తల్లాడ పంచాయతీ అభివృద్ధిలో ముందంజలో ఉన్నది. మేజర్ పంచాయతీలో స్థల సమస్య ఉన్నా డంపింగ్ యార్డ్ కోసం రూ.13 లక్షలతో అర ఎకరం భూమిని కొనుగోలు చేసి డంపింగ్ యార్డ్ నిర్మించారు. మేజర్ పంచాయతీ పరిధిలోని నారాయణపురం గ్రామం వద్ద ఆక్రమణలో ఉన్న 3 ఎకరాల్లో పల్లె ప్రకృతి వనం, వన నర్సరీ ఏర్పాటు చేశారు. శ్మశాన వాటికకు తల్లాడకు చెందిన వేమిశెట్టి జనార్ధన్ 2 ఎకరాలు దానం చేయగా ఎస్‌ఆర్ ఈజీఎస్ ద్వారా రూ.10 లక్షలతో శ్మశాన వాటిక నిర్మించారు. రూ.30 లక్షల వ్యయంతో ఎస్సెస్పీ స్థలంలో రైతు వేదిక భవనాన్ని నిర్మించారు. రూ.50 లక్షలతో 19 సీసీ రోడ్లను నిర్మించడం జరిగింది. ఇంటి పన్నుల వసూళ్లలో ఈ ఏడాది 92శాతం వసూళ్లు చేసింది. తల్లాడ పంచాయతీ అభివృద్ధిలో నెంబర్ 1గా నిలిచింది.



ఎస్సెస్పీ స్థలంలో నిర్మించిన రైతు వేదిక



దాతల సాయంతో కొనుగోలు చేసిన వైకుంఠ రథం

పారిశుద్ధ్యంపై ప్రత్యేక శ్రద్ధ..

పంచాయతీలో పారిశుద్ధ్యంపై ప్రత్యేక శ్రద్ధ వహిస్తున్నారు. పారిశుద్ధ్యం మెరుగుదలకు రెండు ట్రాక్టర్లను కొనుగోలు చేశారు. గ్రామ పంచాయతీ సిబ్బందితో మురికి కాల్వలను శుభ్రం చేస్తూ ఎప్పటికప్పుడు పర్యవేక్షిస్తున్నారు. ఇంటింటికీ తడి, పొడి చెత్త బుట్టలను పంపిణీ చేసి, ట్రాక్టర్ల ద్వారా చెత్తను డంపింగ్ యార్డ్‌కు తరలిస్తున్నారు.

దాతల సహకారంతో అభివృద్ధి..

పంచాయతీ అభివృద్ధికి ఈఓ ఉమా ప్రత్యేక శ్రద్ధ తీసుకొని 10 మంది దాతల సాయంతో రూ.4.5 లక్షలతో వైకుంఠ రథాన్ని కొనుగోలు చేశారు. ఈ వైకుంఠ రథానికి ప్రత్యేకంగా షెడ్డు నిర్మించారు. ఎన్‌ఆర్‌ఐ దగ్గుల ప్రభాకర్‌రెడ్డి రూ.1.50 లక్షలు అందించగా గ్రామ పంచాయతీ నుంచి రూ.2 లక్షలు కలిపి స్వీపింగ్ మిషన్‌ను కొనుగోలు చేశారు.

ఉత్తమ పంచాయతీగా రెండు సార్లు..

గ్రామ పంచాయతీ అభివృద్ధిలో ఆదర్శంగా నిలవటంతో పంచాయతీ రెండు సార్లు ఉత్తమ పంచాయతీగా అవార్డులు దక్కించుకుంది. తొలిసారి 2020లో అప్పటి కలెక్టర్ ఆర్‌వీ కర్ణన్ చేతులు మీదుగా సర్పంచ్ సంధ్యారాణికి అవార్డు వచ్చింది. తిరిగి ఈ ఏడాది మార్చిలో జిల్లా స్థాయిలో ఉత్తమ పంచాయతీగా మళ్లీ అవార్డు దక్కించుకున్నారు.

సీఎం ప్రకటించిన రూ.10 కోట్లతో అభివృద్ధి పనులకు ప్రతిపాదనలు..

ఇటీవల ఖమ్మం సభలో సీఎం కేసీఆర్ రూ.10 కోట్లు తల్లాడ పంచాయతీకి కేటాయించారు. ఇటీవల జిల్లా కలెక్టర్, సత్తుపల్లి ఎమ్మెల్యే వెంకటవీరయ్య స్థానిక ప్రజా ప్రతినిధులతో కలిసి పర్యటించి ఏఏ పనులు చేపట్టాలో గుర్తించారు. ఈ నిధులతో పంచాయతీలో వెజ్ అండ్ నాన్ వెజ్ మార్కెట్, లైబ్రరీ నిర్మాణం, మినీ స్టేడియం, ట్యాంక్‌బండ్, సులభ్ కాంప్లెక్స్, అంబేడ్కర్ భవనం, సీసీ రోడ్లు నిర్మాణం చేపట్టనున్నారు. ఈ పనులకు ఎస్టిమేట్స్ తయారు చేసి టెండర్లు కోసం పంపించారు. టెండర్లు పూర్తైయిన వెంటనే పనులు చేపడతారు.

ప్రజల సహకారంతో అభివృద్ధి..



ప్రజల సహకారంతో తల్లాడ పంచాయతీలో అభివృద్ధి జరిగింది. నాలుగేళ్లలో సంపూర్ణ అభివృద్ధి సాధించాం. ప్రభుత్వం ఇచ్చిన నిధులతో, దాతల సహకారంతో అభివృద్ధి పనులు నిర్వహించాం. సీఎం కేసీఆర్ రూ.10 కోట్లు కేటాయించిన నిధులతో అభివృద్ధికి ప్రణాళికలు తయారు చేశాం. టెండర్లు ద్వారా వాటిని కూడా పూర్తి చేస్తాం.

– పొట్టేటి సంధ్యారాణి, సర్పంచ్, తల్లాడ

దాతల సహకారం మరువలేనిది..



దాతల సహకారంతో పంచాయతీలో మరింత అభివృద్ధి జరుగుతోంది. స్వీపింగ్ మిషన్, వైకుంఠ రథం కొనుగోలుకు దాతలు ముందుకు వచ్చారు. 4 నెలల వ్యవధిలోనే రూ.5.50 లక్షలు విరాళంగా ఇచ్చారు. తల్లాడ పంచాయతీలో అభివృద్ధికి ఇది తొలి అడుగు. ప్రజల సహకారంతో 92 శాతం ఇంటి పన్నుల వసూళ్లు చేశాం.

– ఉమా, ఈఓ, తల్లాడ

సౌకర్యాలు సమకూరాయి..



తల్లాడ పంచాయతీలో అన్ని సౌకర్యాలు సమకూరాయి. సీసీ రోడ్లు, పల్లె ప్రకృతి వనం, శ్మశాన వాటిక ఏర్పాటు చేశారు. ప్రతి రోజు పారిశుద్ధ్యంపై శ్రద్ధ తీసుకుంటున్నారు. ట్రాక్టర్ల ద్వారా చెత్తను డంపింగ్ యార్డ్‌కు తరలిస్తున్నారు. దోమల నివారణకు కూడా చర్యలు తీసుకుంటున్నారు.

– వేమిరెడ్డి రమేష్‌రెడ్డి, నారాయణపురం

గ్రామాలను అభివృద్ధి చేసుకోవాలి



సీసీ రోడ్ల నిర్మాణానికి శంకుస్థాపన చేస్తున్న జెడ్పీ చైర్మన్ లింగాల కమల్‌రాజ్

చింతకాని: రాష్ట్ర ప్రభుత్వం ఆలోచనలకు అనుగుణంగా ప్రజాప్రతినిధులు, అధికారులు గ్రామాల అభివృద్ధిపై దృష్టి సారించాలని జెడ్పీ చైర్మన్ లింగాల కమల్‌రాజ్ సూచించారు. మండలంలోని తిరుమలాపురంలో రూ.26 లక్షల వ్యయంతో నిర్మించనున్న సీసీ రోడ్లకు శనివారం ఆయన శంకుస్థాపన చేసి మాట్లాడారు. గ్రామాల అభివృద్ధిపై ప్రత్యేక దృష్టి సారించిన ప్రభుత్వం గ్రామపంచాయతీలకే నేరుగా నిధులు మంజూరు చేస్తోందని చెప్పారు. సర్పంచ్ బండి రామాదేవి, ఎంపీపీ కోపూరి పూర్ణయ్య, బీఆర్ఎస్ మండల అధ్యక్షుడు పెంట్యాల పుల్లయ్యతో పాటు గురిజాల హన్మంతరావు, మంకెన రమేష్, వంకాయలపాటి లచ్చయ్య, రాధిక, నాయకులు పాల్గొన్నారు.

మైనార్టీ రుణాలకు లబ్ధిదారుల ఎంపిక

పెనుబల్లి : మండలంలోని మైనార్టీ రుణాలకు లబ్ధిదారులను శనివారం ఎంపిక చేశారు. మండల పరిషత్ కార్యాలయంలో ఎంపీడీఓ కావూరి మహాలక్ష్మి ఆధ్వర్యంలో మండలంలోని మైనార్టీ రుణాలకు దరఖాస్తు చేసుకున్న అభ్యర్థులను లాటరీ పద్ధతి ద్వారా ఎంపిక చేయడం జరిగిందన్నారు. రూ.లక్ష యూనిట్ కోసం 37 మంది దరఖాస్తు చేసుకోగా లాటరీ పద్ధతిలో తాళ్లపెంటకు చెందిన షేక్ హుస్సేన్ బీ, రామచంద్రాపురంకు చెందిన హలీం భాషాలను ఎంపిక చేయడం జరిగిందన్నారు. ఈ కార్యక్రమంలో యూడీసీ నాగేశ్వరరావు, కోఆప్షన్ సభ్యులు ఎస్కే గౌస్ తదితరులు పాల్గొన్నారు.

రాజకీయ స్వార్థంతో వస్తున్నారు..

- నియోజకవర్గంలో రూ.వెయ్యి కోట్లతో అభివృద్ధి
- సత్తుపల్లి ఎమ్మెల్యే సండ్ర వెంకటవీరయ్య

సత్తుపల్లి: ఎన్నికల ముందు అదిచేస్తాం.. ఇది చేస్తామంటూ రాజకీయ స్వార్థంతో వస్తున్న వారిని కేసీఆర్ ప్రభుత్వంలో అమలువుతున్న సంక్షేమ పథకాలను ఎందుకు అమలు చేయలేకపోయారో నిలదీయాలని సత్తుపల్లి ఎమ్మెల్యే సండ్ర వెంకటవీరయ్య సూచించారు. సత్తుపల్లిలో శనివారం ఏర్పాటుచేసిన సమావేశంలో 145 మందికి రూ.78 లక్షల విలువైన సీఎంఆర్‌ఎఫ్ చెక్కులను ఆయన అందజేసి మాట్లాడారు. తమ ప్రభుత్వాన్ని నిత్యం విమర్శించే వారికి కూడా సంక్షేమ ఫలాలు అందుతున్నాయని తెలిపారు. సత్తుపల్లి నియోజకవర్గంలో రూ.100కోట్లతో అభివృద్ధి పనులు చేశామన్నారు. నలభై గ్రామాల్లో ప్రభుత్వం భూమి సేకరణ పూర్తయినందున త్వరలోనే పేదలకు పట్టాలు అందిస్తామని చెప్పారు. వచ్చేనెల 2వ తేదీ నుంచి ప్రచారంలో నిమగ్నమై ప్రభుత్వ పథకాలను ప్రచారం చేయాలని పార్టీ శ్రేణులకు సూచించారు. కాగా, ఈనెల 31న రైతుల నుంచి సేకరించిన వరిగడ్డిని ఖమ్మంలోని గోశాలలకు అందించనున్నట్లు ఎమ్మెల్యే తెలిపారు. ఇక తెలంగాణ దశాబ్ధి ఉత్సవాలను అందరూ ప్రతిష్టాత్మకంగా తీసుకోవాలని సూచించారు. ఈ సమావేశంలో మున్సిపల్ చైర్మన్ కూసంపూడి మహేష్, జిల్లా గ్రంథాలయ సంస్థ చైర్మన్ కొత్తూరు ఉమామహేశ్వరరావు, ఆత్మ చైర్మన్ వనమా వాసు, పెనుబల్లి ఎంపీపీ లక్కినేని అలేఖ్య, జెడ్పీటీసీలు కూసంపూడి రామారావు, కట్టా అజయ్‌కుమార్, ఎస్.కే.చాంద్‌పాషా పాల్గొన్నారు.

రూ.1.50 లక్షల ఎల్‌ఓసీ..

సత్తుపల్లిటౌన్: పట్టణంలోని విరాట్‌నగర్‌కు చెందిన వెలిశాల నాగదుర్గాభవాని చికిత్స కోసం రూ.1.50లక్షల ఎల్‌ఓసీని ఎమ్మెల్యే సండ్ర వెంకటవీరయ్య అందజేశారు. మున్సిపల్ చైర్మన్ కూసంపూడి మహేష్, బీఆర్ఎస్ పట్టణ అధ్యక్షుడు ఎస్.కే.రఫీతో పాటు సురేందర్‌రెడ్డి, ఎం.డీ.గఫార్ ఖాన్ పాల్గొన్నారు.



సత్తుపల్లి: లబ్ధిదారులకు సీఎంఆర్‌ఎఫ్ చెక్కులు అందజేస్తున్న ఎమ్మెల్యే వెంకటవీరయ్య

జీలుగు విత్తనాలు పంపిణీ..

కల్లూరు: మండలంలోని కల్లూరు, కొర్లగూడెం, చెన్నూరు, పోచవరం, చిన్నకోరుకొండి సొసైటీల పరిధి రైతుల కోసం జీలుగు విత్తనాలను ఎమ్మెల్యే వెంకటవీరయ్య పంపిణీ చేశారు. ఈసందర్భంగా కల్లూరు రైతు వేదికలో ఏర్పాటుచేసిన సమావేశంలో ఆయన మాట్లాడుతూ నియోజకవర్గంలో రూ.9 కోట్ల మేర రాయితీ విత్తనాలు అందిస్తున్నట్లు తెలిపారు. కాగా, 6పభుత్వ సూచనల మేరకు రైతులు నెల ముందుగా సాగు ప్రారంభిస్తే అకాల వర్షాల నుంచి ముప్పు ఉండదని చెప్పారు. ఆర్‌డీఓ సీహెచ్.సూర్యనారాయణ, జెడ్పీటీసీ కట్టా అజయ్‌కుమార్, సొసైటీ చైర్మెన్లు బోబోలు లక్ష్మణరావు, నర్వనేని అంజయ్యతో పాటు డాక్టర్ లక్కినేని రఘు, పసుమర్తి చందర్‌రావు, గుర్రం శ్రీనివాసరావు, ఎంపీటీసీ మాదిరాజు లక్ష్మణరావు తదితరులు పాల్గొన్నారు.

గిరిజనులను అవమానిస్తున్న బీజేపీ



మాట్లాడుతున్న రాందాస్ నాయక్

వైరా: పార్లమెంట్ భవన ప్రారంభోత్సవ కార్యక్రమానికి రాష్ట్రపతి ద్రౌపది ముర్మును ఆహ్వానించకుండా కేంద్రంలోని బీజేపీ ప్రభుత్వం గిరిజనులను దారుణంగా అవమానించిందని కాంగ్రెస్ ఎస్టీ సెల్ రాష్ట్ర నాయకుడు మాలోత్ రాందాస్ నాయక్ విమర్శించారు. వైరాలో శనివారం నిర్వహించిన ముఖ్య కార్యకర్తల సమావేశంలో ఆయన మాట్లాడుతూ.. ప్రధాని మోదీ పేరుకే మహిళలకు పదవులు ఇస్తారు కానీ వారికి స్వేచ్ఛనివ్వకుండా నిరంకుశ పాలన చేస్తున్నారన్నారు. దళితులు, గిరిజనులపై గౌరవం ఉందన్న బీజేపీ ప్రభుత్వానికి పార్లమెంట్ భవన ప్రారంభోత్సవంలో ఆ గౌరవం ఎక్కడికి పోయిందన్నారు. ఈ కార్యక్రమంలో నాయకులు సీతారాములు, వెంకటనర్సిరెడ్డి, నరసింహారావు, అశోక్, చెన్నారావు తదితరులు పాల్గొన్నారు.

రోడ్డు ప్రమాదంలో ఇద్దరికి గాయాలు

మధిర: మండలంలోని దెందుకూరు గ్రామ సమీపంలో శనివారం జరిగిన రోడ్డు ప్రమాదంలో ఇద్దరికి గాయాలు అయ్యాయి. దెందుకూరుకు చెందిన గోపాలరావు మోటార్ సైకిల్‌పై మధిర నుంచి ఇంటికి వెళుతుండగా ఎదురుగా వచ్చిన మరో మోటార్ సైకిల్ ఢీ కొట్టడంతో గోపాలరావుతో పాటు మరో వ్యక్తికి గాయాలు అయ్యాయి. క్షతగాత్రులను 108 వాహనంలో మధిర ప్రభుత్వ ఆస్పత్రికి తరలించారు.

టీడీపీ మహానాడుకు తరలిన కార్యకర్తలు

కొణిజర్ల: ఏపీలోని రాజమహేంద్రవరంలో శనివారం నిర్వహించిన టీడీపీ మహానాడు, స్వర్గీయ మాజీ సీఎం ఎన్టీ రామారావు శతజయంతి ఉత్సవాలకు కొణిజర్ల మండలం నుంచి టీడీపీ కార్యకర్తలు తరలి వెళ్లారు. మండల అధ్యక్షుడు తాతా సుధాకర్‌రావు నేతృత్వంలో పెద్దగోపతి సర్పంచ్ దానియేలు, భాస్కరరావు, అంజనేయులు, వెంకటేశ్వరరావు, వెంకన్న, హనుమాన్, స్వర్ణ నవీన్, సాయి, నరేష్ తదితరులు తరలి వెళ్లారు.

30న మండల పరిషత్ సర్వసభ్య సమావేశం

ఎర్రుపాలెం: ఈ నెల 30న ఉదయం 10గంటలకు మండల పరిషత్ సర్వసభ్య సమావేశం నిర్వహించనున్నట్లు ఎంపీపీ దేవరకొండ శిరీష, ఎంపీడీఓ బి.శ్రీనివాసరావులు శనివారం ఒక ప్రకటనలో తెలిపారు. ఈ సమావేశానికి మండలాధికారులు, సర్పంచ్‌లు, ఎంపీటీసీలు, కార్యదర్శులు సకాలంలో హాజరుకావాలని కోరారు. సమావేశానికి హాజరుకాని అధికారుల వివరాలను జిల్లా కలెక్టర్‌కు నివేదిస్తామని తెలిపారు.

మొక్కజొన్నలు కొనుగోలు చేయాలి

మధిర: ప్రభుత్వం రైతుల నుంచి వెంటనే మొక్కజొన్నలు కొనుగోలు చేయాలని మండల కాంగ్రెస్ అధ్యక్షుడు సూరంశెట్టి కిషోర్ డిమాండ్ చేశారు. మధిర వ్యవసాయ మార్కెట్ యార్డులో రైతులు ఆరబోసిన మొక్కజొన్నలను శనివారం కాంగ్రెస్ పార్టీ నాయకులు పరిశీలించారు. రైతులతో మాట్లాడి సమస్యలు అడిగి తెలుసుకున్నారు. ఈ సందర్భంగా కిషోర్ మాట్లాడుతూ.. అధికార పార్టీ నాయకులు మొక్కజొన్న, ధాన్యం కొనుగోలు కేంద్రాలను ఆర్భాటంగా ఏర్పాటు చేసి తేమ శాతం పేరుతో కుంటి సాకులు చెబుతూ ధాన్యాన్ని, మొక్కజొన్నలను కొనుగోలు చేయడం లేదని ఆరోపించారు. ఆయా కేంద్రాల్లో రైతులు రోజులు తరబడి పడిగాపులు కాస్తున్నారని తెలిపారు. ఇప్పటివరకు ఒక్క మొక్కజొన్న గింజను కూడా కొనుగోలు చేయలేదని చెప్పారు. కార్యక్రమంలో మండల కిసాన్ సెల్ అధ్యక్షుడు వెంకటేశ్వరరెడ్డి, నాయకులు బాలరాజు, రామారావు, కిరణ్, జహంగీర్, ప్రసాద్, కోటిరెడ్డి, కృష్ణారెడ్డి ఉన్నారు.



మక్కలను పరిశీలిస్తున్న కాంగ్రెస్ నాయకులు

రైతులకు నష్టపరిహారం చెల్లించాలి



మాట్లాడుతున్న పోతినేని సుదర్శన్

చింతకాని: వర్షాలకు పంటలను నష్టపోయిన రైతులకు వెంటనే నష్టపరిహారాన్ని చెల్లించాలని సీపీఎం రాష్ట్ర కార్యదర్శివర్గ సభ్యుడు పోతినేని సుదర్శన్ ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. మండలంలోని నాగులవంచ గ్రామంలో శుక్రవారం రాత్రి జరిగిన పార్టీ మండల సమావేశంలో ఆయన పాల్గొని ప్రసంగించారు. రాష్ట్ర ప్రభుత్వం రైతులకు పరిహారం అందిస్తామని చెప్పి నెలలు గడుస్తున్నా.. నేటి వరకు రైతుల ఖాతాలో పరిహారం జమ కాలేదన్నారు. ఈ సమావేశంలో సీపీఎం సీనియర్ నాయకుడు సామినేని రామారావు, మండల కార్యదర్శి గోపాలరావు, నాయకులు జానికిరాములు, ఉపేందర్, వీరబాబు, గోపయ్య తదితరులు పాల్గొన్నారు.

కేశ్వాపురం అభివృద్ధి ప్రదాత పురుషోత్తం..

తల్లాడ: కేశ్వాపురం అభివృద్ధి ప్రదాత ఎరవనేని పురుషోత్తం అని సీపీఎం రాష్ట్ర కార్యదర్శి వర్గ సభ్యుడు పోతినేని సుదర్శన్‌రావు అన్నారు. తల్లాడ మండలం కేశ్వాపురం గ్రామంలో శనివారం కట్టా వెంకట్రామయ్య అధ్యక్షతన జరిగిన సంస్మరణ సభలో ఆయన మాట్లాడారు. ఈ సందర్భంగా ఆయన చిత్రపటానికి పూలమాల వేసి నివాళులర్పించారు. కార్యక్రమంలో రాష్ట్ర విత్తనాభివృద్ధి సంస్థ చైర్మన్ కోటేశ్వర్‌రావు, ఎంపీపీ శ్రీనివాసరావు, సత్తుపల్లి నియోజక వర్గ సీపీఎం ఇన్‌చార్జ్ భారతి, నాయకులు రమేష్, కృష్ణమూర్తి, రాంబాబు, రామలింగేశ్వరరావు, సత్యనారాయణరెడ్డి, రామారావు, వెంకటేశ్వరరావు, నరేష్‌రాజు, రఘు పాల్గొన్నారు.

సీపీఐ ‘ప్రజాగర్జన’ను జయప్రదం చేయండి

సత్తుపల్లిరూరల్/కొణిజర్ల: దేశంలో, రాష్ట్రంలో ప్రజా సమస్యల పరిష్కారానికి సీపీఐ ఆధ్వర్యంలో జూన్ 4న కొత్తగూడెంలో నిర్వహించే సీపీఐ ప్రజాగర్జన సభను విజయవం చేయాలని సీపీఐ జిల్లా కార్యవర్గ సభ్యుడు దండు ఆదినారాయణ, సీపీఐ జిల్లా నాయకుడు దొండపాటి రమేష్ పిలుపునిచ్చారు. సత్తుపల్లిలోని గంగారంలో శనివారం జరిగిన సమావేశంలో ఆదినారాయణ మాట్లాడారు. కొణిజర్లలోని పల్లిపాడు, దిద్దుపూడి గ్రామాల్లో ఆ పార్టీ నాయకులు విస్తృత ప్రచారం నిర్వహించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ.. మోదీ పార్లమెంట్ భవనం ప్రారంభానికి రాష్ట్రపతిని ఎందుకు పిలవడం లేదని ప్రశ్నించారు. ఈ సమావేశంలో రాంబాబు, సత్యనారాయణ, సతీష్, సైదులు, సావిత్రమ్మ, వెంకటమ్మ, ఏసమ్మ, రాములమ్మ, కృష్ణమ్మ, సత్యం, నాగరాజు, తోటపల్లి సీతారాములు, మాచర్ల నాగభూషణం, గడ్డం మల్లేశ్వరరావు, కిలారు పుల్లారావు, అమర్లపూడి అనీల్, సూర్యం, కొత్త వెంకటేశ్వర్లు, పోట్ల గోపాలరావు తదితరులు పాల్గొన్నారు.



మాట్లాడుతున్న దండు ఆదినారాయణ

ముగిసిన హాథ్ సే హాథ్ జోడో యాత్ర



కాంగ్రెస్ పార్టీ జెండాను ఆవిష్కరిస్తున్న మాజీ మంత్రి సంభాని చంద్రశేఖర్

సత్తుపల్లి: సత్తుపల్లిలో హాథ్ సే హాథ్ జోడో యాత్రలో భాగంగా కాంగ్రెస్ నాయకులు చేపట్టిన ఇంటింటి ప్రచారం నేటితో ముగిసింది. ఈ సందర్భంగా పట్టణంలోని అయ్యగారిపేటలో శనివారం కాంగ్రెస్ పార్టీ జెండాను మాజీ మంత్రి సంభాని చంద్రశేఖర్ ఆవిష్కరించారు. అనంతరం నాగళ్ల రామారావు నివాసంలో జరిగిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడుతూ.. బీఆర్ఎస్ ప్రభుత్వం ఎన్నికల్లో ఇచ్చిన హామీలను అమలు చేయలేదన్నారు. ధాన్యం కొనుగోళ్లు పూర్తి స్థాయిలో జరగలేదని, రుణమాఫీ పూర్తి కాలేదన్నారు. రేషన్‌కార్డులు, పెన్షన్లు చాలా మందికి రావటం లేదన్నారు. కర్ణాటకలో మాదిరిగానే తెలంగాణలో కూడా రేషన్‌ను పది కేజీలకు పెంచాలన్నారు. వెంగళరావు పార్కును ఎవరూ పట్టించుకోవటం లేదని, సత్తుపల్లిలో ప్రభుత్వ ఇంజనీరింగ్ కళాశాల అవసరమన్నారు. పట్టణంలో డ్రెయినేజీ, తాగునీటి వ్యవస్థ అస్తవ్యస్తంగా ఉందన్నారు. దళిత బంధు పథకం ఎవరికి అందటం లేదన్నారు. ఈ కార్యక్రమంలో పట్టణ, మండల అధ్యక్షులు కొత్రపాటి సాల్మన్‌రాజు, శివ వేణు, కుమారి, దేవళ్ల పెద్దిరాజు, కాలం కృష్ణ, నాగళ్ల ప్రసాద్ పాల్గొన్నారు.

మాలమహానాడు ముఖ్య కార్యకర్తల సమావేశం

ముదిగొండ: జిల్లా స్థాయి మాల మహానాడు ముఖ్యకార్యకర్తల సమావేశం ముదిగొండలో శనివారం నిర్వహించారు. ఈ సమావేశానికి ముఖ్య అతిథిలుగా జాతీయ అధ్యక్షుడు తాళ్లపల్లి రవి, రాష్ట్ర మహిళా అధ్యక్షురాలిగా గాజుల పున్నమ్మ హాజరైయ్యారు. నూతనంగా జిల్లా అధ్యక్షుడిగా సంఘం ఆధ్వర్యంలో కామ సంపత్‌కుమార్‌ను ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. ఈ నియామక పత్రాన్ని రాష్ట్ర నాయకుడు చేతుల మీదుగా సంపత్‌కుమార్ అందుకున్నారు. కార్యక్రమంలో సంఘం రాష్ట్ర ఉపాధ్యక్షుడు కొరవి వెంకటరత్నం, రాష్ట్ర కార్యదర్శి ప్రకాశం, జిల్లా ఉపాధ్యక్షుడు నాగేందర్‌బాబు, నాయకులు స్వర్ణలత, నవీన్ రామారావు, జ్యోతి తదితరులు పాల్గొన్నారు.

ముమ్మరంగా ఉపాధిహామీ పనులు

కల్లూరు రూరల్: మండలంలో ఉపాధిహామీ పనులు ముమ్మరంగా జరుగుతున్నాయి. అన్ని పంచాయతీల్లో పనులను పూర్తి చేసేందుకు గ్రామపంచాయితీ కార్యదర్శులు, ఈజీఎస్ సిబ్బంది చర్యలు చేపట్టారు. శనివారం పటమరలోకవరం పెద్దచెరువు పూడిక తీసేందుకు వచ్చిన కూలీలకు సర్పంచ్ కల్యాణపు కొండల్‌రావు మజ్జిగ ప్యాకెట్లు పంపిణీ చేశారు.

మండల సర్వసభ్య సమావేశం



మాట్లాడుతున్న ఎంపీడీఓ చంద్రశేఖర్

కారేపల్లి: కారేపల్లి మండల పరిషత్ కార్యాలయంలో ఎంపీపీ మాలోత్ శకుంతల అధ్యక్షతన శనివారం మండల సర్వసభ్య సమావేశం నిర్వహించారు. ఈ సమావేశానికి అధికారులు, సర్పంచ్‌లు, ఎంపీటీసీలు, పంచాయతీ కార్యదర్శులు తదితరులు పాల్గొని పలు అంశాలపై చర్చించారు. అబ్కారీ శాఖ సమీక్ష జరుగుతున్న సమయంలో సర్పంచ్‌లు బానోత్ కుమార్, బానోత్ బన్సిలాల్ లు అబ్కారీ అధికారులను నిలదీశారు. మండలంలో బెల్టు షాపులు యథేచ్ఛగా నిర్వహిస్తున్నారని, ఈ క్రమంలో మద్యం కల్తీ జరుగుతుందన్నారు. దీంతో పాటుగా గుడుంబా విక్రయాలు కూడా జోరుగా సాగుతున్నాయన్నారు. ఎక్సైజ్ ఎస్సై వసంత స్పందిస్తూ.. ఫిర్యాదు చేస్తే ఖచ్చితంగా చర్యలు తీసుకుంటామని ఆమె పేర్కొన్నారు. అనంతరం విద్యుత్ శాఖ అధికారుల నిర్లక్ష్యంపై ప్రజాప్రతినిధులు ఆగ్రహం వ్యక్తం చేశారు. ఇటీవల కాలంలో విద్యుత్ శాఖ అధికారుల నిర్లక్ష్యం కారణంగా.. పశువులు మృత్యువాత పడుతున్నాయన్నారు. సమావేశంలో జెడ్పీటీసీ వాంకుడోతు జగన్, వైఎస్ ఎంపీపీ శ్రీనివాసరావు, ఎంపీడీఓ చంద్రశేఖర్, డిప్యూటీ తహసీల్దార్ లక్ష్మి పాల్గొన్నారు.